క్లుప్తంగా

అయ్యప్పస్వామికి అభిషేకం

ఉండవెల్లి: మండలంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి ఉత్తరా నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గురువారం అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 18 మెట్ల పడిపూజ నిర్వహించారు. గురు స్వాములు సూర్య కాంతారెడ్డి, రాములు, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆటోలో మద్యం పట్టివేత

మానవపాడు: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాము కథనం ప్రకారం.. మానవపాడు మండలకేంద్రం నుంచి కొర్విపాడుకు నాగరాజు ఆటోలో మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటో విలువ రూ.లక్షా ఉంటుందని, 22.5 లీటర్ల మద్యం పట్టుకున్నామని తెలిపారు. మొత్తం విలువ రూ.1,24,750 ఉంటుందన్నారు. అమరవాయికి చెందిన నాగరాజు వద్ద 6.6లీటర్ల మద్యం, విలువ రూ.5,500 ఉంటుందని తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.


ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని ఆర్ గార్లపాడుకు చెందిన మహేష్ గురువారం తన ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇటిక్యాల పోలీసులు షేకుపల్లి రోడ్డులోని రైస్ మిల్లు దగ్గర తనిఖీ నిర్వహించారు. దీంతో మద్యం తరలిస్తున్న మహేష్ బైక్‌ను తనిఖీ చేయగా 15 లీటర్ల మద్యం దొరికింది. దాని విలువ రూ.41వేలు ఉంటుందని ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపారు. బైక్‌ను సీజ్ చేసి, మద్యాన్ని పీఎస్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మానవపాడు: మండలంలోని జల్లాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని డిప్యూటీ తహసీల్దార్ ముసాయిదాబేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని సూచించారు. పౌష్టికాహారం పదార్థాలతో పాటుగా వంటకాలను రుచికరంగా వండాలని సూచించారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన నిర్మాణాలకు భారతీ సిమెంట్



గద్వాలన్యూటౌన్: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరు అని ఆ సంస్థ మార్కెటింగ్ అధికారి విజయ్ బాబు అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని శ్రీరంగ స్వామి ట్రేడర్స్ ఆధ్వర్యంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతంగా పూర్తి అవుతుందన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి వినియోగదారులకు సహాయపడతారన్నారు. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. యాదాద్రి, ఆలేరు–వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్ వాడటం చాలా గర్వకారణమన్నారు. విజయ్‌బాబును డీలర్లు సన్మానించారు. డీలర్ రంగస్వామి, శ్రీనివాసులు, సబ్ డీలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవా కథనం మేరకు.. గద్వాల మండలంలోని పూడూరుకు చెందిన పరశు పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై కర్నూల్‌కు వెళ్లాడు. పని ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు పక్కనుంచి బైక్‌కు తగలడంతో బోల్తాపడి అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్మీకంపోస్టుతో ప్రయోజనాలెన్నో..



షేకుపల్లిలో తయారైన వర్మీ కంపోస్టు ఎరువు



ఎరువు తయారీకి వినియోగిస్తున్న తడి వ్యర్థాలు

- పల్లెల్లో తడి, పొడి చెత్త సేకరణ
- సెగ్రిగేషన్‌షెడ్లలో సేంద్రియ ఎరువుగా తయారీ
- జీపీల అభివృద్ధికి నిధుల వినియోగం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను జీపీ ట్రాక్టర్ల ద్వారా ప్రతిరోజు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సేకరించిన తడి, పొడి వ్యర్థ పదార్థాలను ఉపయోగించి షెడ్లలో వానపాముల ద్వారా వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్లెల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువు నాణ్యతగా ఉండటంతో కొన్ని గ్రామాల్లో హరితహారం మొక్కలకు ఇదే ఎరువును వినియోగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో పంట పొలాలకు రైతులు తీసుకెళ్తున్నారు. దీని ద్వారా జీపీలు నిధులు సమకూరుతున్నాయి. సేంద్రియ ఎరువు 50 కేజీల బస్తా రూ.600లకు అందుబాటులో ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీపీలకు బహుళ ప్రయోజనాలు..

డంపింగ్‌యార్డులలో ఉన్న తడి, పొడి చెత్తను ముందుగా విడివిడిగా వేరు చేస్తున్నారు. వేరు చేసిన తడి చెత్తను ఉపయోగించి వర్మీకంపోస్టు (సేంద్రియ) ఎరువును తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను కూడా రిసైక్లింగ్‌కు తరలించడంతో జీపీకి మరికొంత ఆదాయం సమకూరుతోంది. వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి కావలసిన వానపాములను ప్రభుత్వం పంచాయతీ నిధుల నుంచే కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించింది. సేంద్రియ ఎరువును మొక్కల ఎదుగుదలకు, నర్సరీల పెంపకానికి వాడడం వల్ల జీపీల్లో బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయి.

సేంద్రియ ఎరువు తయారీ ఇలా..

డంపింగ్‌యార్డులోని తడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌లో వానపాములను కలిపి తగిన జాగ్రత్తలు తీసుకొని 50 నుంచి 60 రోజులు నిల్వ చేస్తే వర్మీ కంపోస్టు ఎరువు తయారవుతుంది. ఎరువు నాణ్యతగా ఉండేందుకు ప్రత్యేకంగా జల్లెడ పడుతున్నారు. ఒక్కో డంపింగ్‌యార్డు ద్వారా ఏడాదికి 4 నుంచి 6 సార్లు వర్మీకంపోస్టు ఎరువు తయారవుతుంది. దీన్ని హరితహారం మొక్కలతో పాటు నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు వినియోగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో కంపోస్టు ఎరువు అధికంగా తయారుకావడంతో పంట పొలాలకు సేంద్రియ ఎరువుగా వాడుకునేందుకు రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు.

మొక్కలకు వినియోగిస్తున్నాం



గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో వానపాముల ద్వారా తడి చెత్త, వ్యర్థాలను వినియోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నాం. దీనిని హరితహారంలో నాటిన మొక్కలకు వినియోగించడంతో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఉన్న మొక్కలకు కూడా ప్రతి నెలకు ఒకసారి వేస్తున్నాం. సేంద్రియ ఎరువును మొక్కలకు వాడటం వల్ల మొక్కలు ఎంతో పచ్చదనంతో పులకరించి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి, కోదండాపురం

నాణ్యమైన ఎరువు తయారీ..



ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో వానపాములను ఉపయోగించి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన తడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జీపీల్లో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువు ఎంతో నాణ్యతతో ఉంటుంది. కాబట్టి మొక్కలకు వేయడం వల్ల బలంగా, ధృడంగా పెరుగుతున్నాయి. మొక్కల పెంపకం కోసం ఎవరికైన సేంద్రియ ఎరువు కావాలంటే స్థానిక జీపీల్లో సంప్రదించాలి.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

కర్ణాటకలో ఇచ్చిన హామీలకే దిక్కు లేదు



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: 'కర్ణాటకలో ఇచ్చిన ఐదు హామీలకే దిక్కు లేదు, తెలంగాణలో చేస్తామంటే ఎవరు నమ్ముతారు? ప్రజలు ఎలా నమ్ముతారని అనుకుంటున్నారు? అదంతా మీ భ్రమ' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మండలంలోని జాంపల్లి, కొత్తపాలెం, కొత్తపాలెం తండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాతనే రూపు రేఖలు మారాయని, అప్పటి వరకు ఏలిన కాంగ్రెస్ ఇతర పార్టీలు ఏం చేశాయని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎన్ని గంటల కరెంటు ఇస్తుందో మాట్లాడే దమ్ముందా అని ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో అమలు లేని అన్ని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకాలన్ని అమలు అవుతున్నాయా అని నిలదీశారు. ఓట్లు అడగడానికి సిగ్గుండాలన్నారు. రాష్ట్ర ప్రజానీకం గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, రైతు బంధు సమితి అధ్యక్షుడు ఈశ్వరయ్య, గణపతి, వెంకటేశ్వరరెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రాజారెడ్డి, దౌలన్న, వెంకటేష్ నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి

కేటీదొడ్డి: నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి నన్ను ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉమిత్యాల తండా, ఉమిత్యాల, ఇర్కిచేడు, కొండాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిందని కొనియాడారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే గద్వాల ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. జిల్లా నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు చక్రధర్, హనుమంతు, గోవిందు, నసీర్, గోపి, సత్యన్న, సక్రీయనాయక్ ఉన్నారు.

అభివృద్ధి చేసే బాధ్యత మాది

గట్టు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించే బాధ్యత ఓటర్లు తీసుకోవాలని, అభివృద్ధి చేసి, చూపించే బాధ్యత ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చూసుకుంటారని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్ రెడ్డిలు తెలిపారు. గట్టులో ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, జయసింహారెడ్డి, రాముూనాయుడు, బజారి, సంతోష్, వెంకటేష్, కృష్ణ, శివరాజు, బస్వరాజు పాల్గొన్నారు.

ప్రజలు ఓటు వేసేలా చైతన్యపర్చాలి



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



కొంకలలో ఎన్నికల నియమావళి గురించి ప్రజలకు వివరిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

అలంపూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఓటరు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేలా చైతన్యపర్చాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ్ నర్సయ్య అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, వార్డు ఆఫీసర్లు, ఆర్‌పీలకు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉన్న బీఎల్‌ఓలు, వార్డు ఆఫీసర్లు, ఆర్‌పీలు ఓటర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనేలా అవగాహన కల్పించాలన్నారు. కళాశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాధాన్యత తెలియజేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు వీల్ చైర్ వంటి సదుపాయాలను విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మున్సిపాలిటీల్లో పోలింగ్ శాతం పెంచడానికి ర్యాలీలు, ముగ్గుల పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో బీఎల్‌ఓలు, ఆఫీసర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

మానవపాడు: ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశమని, దీన్ని ప్రలోభాలకు అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. గురువారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు గ్రామాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయండి

శాంతినగర్: ఈనెల 30న జరిగే శాసన సభ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని ఎంపీడీఓ రవీంద్ర అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామపంచాయతీ ఆవరణలో ఓటుపై అవగాహన కల్పించారు. ఎంవీ ఫౌండేషన్ హనిమిరెడ్డి, ఎంపీఓ తిరుపతన్న, ఏపీఎం నరహరి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాళ్ల మధ్యలో రేషన్‌బియ్యం



బోరవెల్లిలో ప్లాస్టిక్ బియ్యాన్ని చిన్న గిన్నెలో ఉంచిన బాధితులు



చెన్నిపాడులో రేషన్ బియ్యంలో రాళ్లు

మానవపాడు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలలో రేషన్ లబ్ధిదారులకు ఉచిత బియ్యం అందిస్తుంది. బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం, రాళ్లు కలకలం సృష్టిస్తున్నాయి. మండలంలోని బోరవెల్లి, చెన్నిపాడు గ్రామాల్లో దర్శనమిచ్చాయని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని బోరవెల్లిలో ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని సోషల్‌మీడియాలో సైతం హల్చల్ చేస్తున్నారు. చెన్నిపాడులో రాళ్లు దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యంలోనే ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయా? లేక రేషన్‌షాపు నిర్వాహకులు బియ్యాన్ని కల్తీ చేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల కడుపులో అసౌకర్యం, పొట్టలో పుండ్లు, విరేచనాలు వచ్చే ప్రమాదముందని, వెంటనే ఇటువంటి బియ్యంపై ప్రభుత్వ అధికారులు ప్లాస్టిక్ బియ్యం, రాళ్లపై చర్యల తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ యువత భిక్షాటన



భిక్షాటన చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని నిరసన తెలుపుతూ అలంపూర్ నియోజక నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో యువకులు గురువారం మండల కేంద్రంలో దుకాణాల వద్ద భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గిత్తల రాముడు మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇక ఉద్యోగాలు రావన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ. 2,22 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు రాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. గురువారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చక్రధర్ పాల్గొన్నారు.

పీపీఆర్ టీకాతో జీవాల్లో ఆరోగ్యం



గద్వాల వ్యవసాయం: పీపీఆర్ టీకా వేయించడం వల్ల గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారి శంకరయ్య అన్నారు. గురువారం పట్టణంలోని జమ్మిచేడులో పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో జీవాలకు ఉచితంగా పారుడు రోగ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారుడు వ్యాధి వల్ల జీవాల్లో తీవ్రమైన జ్వరం, దగ్గు, పారుడు వచ్చి బలహీన పడి అనారోగ్యానికి గురవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఫణీంద్ర రాజు, రాముడు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో నాయకులు

సాక్షి నెట్‌వర్క్: మానవపాడులో 100 పడకల ఆస్పత్రికి తాళాలు వేశారని, ఓట్లకోసం ఓపెన్ చేసి మూసేశారని కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు..

ధరూర్ మండలంలోని పారుచర్ల, నెట్టెంపాడు గా మాల్లో ఏఐఎఫ్‌బీ అభ్యర్థి గొంగళ్ల రంజిత్ కుమార్ ప్రచారం చేశారు.

ఉండవెల్లి మండలం తక్కశిలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు గెలుపుకోసం ఇంటింటి ప్రచారం చేశారు.

కేటీదొడ్డి మండలంలోని వెంటాపురం, పాగుంట గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వడ్డేపల్లి మండలంలోని గ్రామాల కులసంఘాల నాయకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తనగల, పచ్చర్లకు చెందిన నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

విశ్వరూప మహాసభ కరపత్రాలను గద్వాలలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విడుదల చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. మల్దకల్ మండలం ఉలిగేపల్లి, ధరూర్ మండలం ఉప్పేరుకు చెందిన 300 మంది ఆమె సమక్షంలో బీజేపీలో చేరారు.

రాజకీయ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తాం

అయిజ: మండలంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలందరి అభిప్రాయంతో తమ రాజకీయ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు అన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంకు బీఫాం ఇవ్వకపోవడం వల్ల ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు అబ్రహం ప్రకటించారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళనకు గురికాకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభిప్రాయ సేకరణలో 90 శాతం మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు తాను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, 7శాతం మంది బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుదామని, ముగ్గురు మాత్రం కాంగ్రెస్ పార్టీలో చేరుదామని వారి అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎక్కువ శాతం బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుదామని తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.

పెద్దొడ్డి రోడ్డుపై గుంతలు పూడ్చాలి



పెద్దొడ్డి- మల్దకల్ గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్: పెద్దొడ్డి–మల్దకల్ గ్రామాల మధ్యనున్న బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఏడేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో ప్రతి నిత్యం వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాహనదారులు తిమ్మప్ప, రాముడు, నర్సింహులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరారు.

భయాలను తొలగించేందుకే ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అయిజ: ఎన్నికల సందర్భంగా ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు శాంతినగర్ సీఐ శివ శంకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని తొత్తినోనిదొడ్డి, మూగోనిపల్లి, భూంపురం గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లు ఎవరి ప్రలోభాలకు గురికాకుండా, నిర్భయంగా తమకు నచ్చిన వారికి ఓటు వేయాలని కోరారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటివారి సమాచారం అధికారులకు చెప్పాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్‌కుమార్, పోలీస్, ఐటీబీపీ బృందం పాల్గొన్నారు.

అన్నదాతల అవస్థలు



ధరూరులోని కొనుగోలు కేంద్రం వద్ద నుంచి ధాన్యాన్ని రాయచూరుకు తరలిస్తున్న రైతులు

ధరూరు: రబీలో రైతులు సాగు చేసుకున్న వరి పంటను అమ్ముకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోవడంతో సెంటర్ వద్దకు తీసుకొచ్చిన వరిధాన్యాన్ని రాయచూరు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. గద్వాల మార్కెట్ యార్డులో క్వింటాళ్లకు రూ.2వేలకు మించి కొనడం లేదని, అదే రాయచూరులో ఒక క్వింటాలు ధాన్యం రకాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ.2,600 వరకు కొంటున్నట్లు రైతులు తెలిపారు. మంచి గిట్టుబాటు ధర రాయచూరులో ఉందని, బస్తాకు రవాణా ఇతర ఖర్చు కింద రూ.100 పోయినా మంచి రేటే ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న చెదురు మదురు వర్షాలు కోతలకు అడ్డంకిగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడ్ అములులో ఉన్నందున అధికార యంత్రాంగం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.